

- రైతులందరికీ రూ. 2లక్షల రుణమాఫీ చేయాలని రైతుల భారీ ధర్నా
- సెప్టెంబరు 15 వరకు డెడ్‌లైన్ విధించిన రైతులు
- రైతుల ధర్నాకు మాజీ ఎమ్మెల్యేల సంఘీభావం
- ధర్నా వద్ద భారీ పోలీసు బందోబస్తు





• ధర్నా చేస్తున్న రైతులు

పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాల్సిందే..

ఆర్మూర్‌రూరల్/ఆర్మూర్‌టౌన్, ఆగస్టు24: రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాల్సిందేనని రైతులు ధర్నాకు దిగారు. ఆర్మూర్‌లోని మామిడిపల్లి శివారులోని పాత జాతీయరహదారిపై రైతు ఐక్యకార్యాచరణ కమిటీ పిలుపు మేరకు వివిధ గ్రామాల రైతుల సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఉదయం 10గంటల నుంచే రైతులు ధర్నా స్థలానికి చేరుకుంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. రుణమాఫీ చేయాలని, ఎకరానికి రూ.7500 రైతుభరోసా ఇవ్వాలని ప్లకార్డులు ప్రదర్శించారు. ఆగస్టు 15 లోగా పూర్తిస్థాయిలో రుణమాఫీ చేస్తామని మాటతప్పిన ప్రభుత్వానికి సెప్టెంబర్ 15 వరకు డెడ్‌లైన్ విధిస్తున్నామని నినదించారు. రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధి వి.ప్రభాకర్ మాట్లాడుతూ ఆర్మూర్ ధర్నా కొందరి కోసం కాదని, 50లక్షల మంది రైతుల కోసమని అన్నారు. ఎన్నికలకు ముందు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పిన సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసగించారని అన్నారు. రైతులపై సీఎంకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే రూ.31వేల కోట్లు విడుదల చేసి రైతుల రుణాలు మాఫీ చేయాలన్నారు. ధర్నాకు వచ్చిన రైతులు మాట్లాడుతూ మాతపరమైన కార్యక్రమాలకు రూ.7కోట్లు మంజూరు చేసిన సీఎం రైతులకు ఎందుకు ఇవ్వరని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు నవీన్‌రెడ్డి మాట్లాడుతూ కేసులకు భయపడేది లేదని, రైతుల సమస్యలపై గతంలో ఎన్నో ఉద్యమాలు చేశామన్నారు. ఇక ముందు రైతు ఐక్యకార్యాచరణ కమిటీ చేపట్టే ఆందోళనలు, ధర్నా కార్యక్రమాల్లో రాజకీయ నాయకులకు అవకాశం ఇచ్చేదిలేదని, వారురావద్దని వేదికపై నుంచి స్పష్టం చేశారు. ఈ ధర్నాలో పెద్దోళ్ల గంగారెడ్డి, ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, పల్లె గంగారెడ్డి, విజయభారతి రెడ్డి, మాజీజడ్పీటీసీ తనుజారెడ్డి, ఇట్టెడి లింగారెడ్డి మాట్లాడుతూ ధాన్యానికి బోనస్‌ను సన్నరకం వరి ధాన్యానికే కాకుండా దొడ్డురకం ధాన్యానికి ఇవ్వాలని తీర్మానించారు. అనంతరం రైతులు ఆర్డీవో రాజాగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, రైతు ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు దేగాం లింగారెడ్డి, దేవరాం, దేగాం యాదగౌడ్, పి.తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జైడి బాస్కర్, రమేష్, సంతోష్‌రెడ్డి, అర్గుల్ సురేష్, జగిత్యాల రైతు ఐక్య కార్యాచరణ కమిటీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

• రైతు ధర్నాకు భారీ బందోబస్తు

రైతు ధర్నాకు ఏసీపీ బస్వారెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని అంబేద్కర్‌చౌరస్తా, మామిడిపల్లి చౌరస్తా, పెర్కిట్ చౌరస్తావద్ద పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించగా ధర్నాస్థలానికి ఇతర వాహనాలు రాకుండా రోడ్డును మూసివేసి మామిడిపల్లి బైపాస్ నుంచి పెర్కిట్‌కు దారి మళ్లించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్‌హెచ్‌వో రవికుమార్ పర్యవేక్షించారు.

• ధర్నాకు తరలివచ్చిన రైతులు

రైతు ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు మేరకు ఆర్మూర్‌లో నిర్వహించిన చలో ఆర్మూర్ రైతు ధర్నాకు రైతులు భారీగా తరలివచ్చారు. రైతులందరికీ రూ.2లక్షలు రుణమాఫీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇచ్చిన మాటల మేరకు ఎకరానికి రూ.7500 రైతుభరోసా అందజేయాలని, వరి ధాన్యానికి రూ.500 బోనస్‌ను సన్నరకం ధాన్యానికే కాకుండా దొడ్డురకం ధాన్యానికి ఇవ్వాలని, పూర్తిస్థాయిలో రైతులందరికీ రుణమాఫీ చేయడానికి ప్రభుత్వానికి సెప్టెంబర్ 15 డెడ్‌లైన్ విధిస్తూ తీర్మానించారు. రుణమాఫీ పూర్తిస్థాయిలో జరగని పక్షంలో భవిష్యత కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతు ధర్నా కార్యక్రమానికి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యేలు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, బాజిరెడి గోవర్ధన్, మాజీ జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు హాజరై రైతుల ధర్నాకు సంఘీభావం తెలిపి రైతులకు మద్దతుగా మాట్లాడారు.

రైతులను నిండా ముంచిన సీఎం

• ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



రుణమాఫీ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి రైతులను నిండా ముంచారని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. ఆర్మూర్ ప్రాంతం పోరాటలకు ప్రసిద్ధి అని, గతంలో అనేకసార్లు ఉద్యమాలు చేసిన చరిత్ర ఆర్మూర్ రైతులకు ఉందన్నారు. రేవంత్‌రెడ్డి మాటలు నమ్మి రైతులు ఓటేస్తే రైతులను మోసం చేస్తున్నారన్నారు. డిసెంబర్ 9న రూ.2లక్షలు రుణమాఫీ చేస్తానని ఒకసారి, వంద రోజుల్లో చేస్తామని రెండోసారి రైతులను మోసం చేస్తూవచ్చారని అన్నారు. ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్‌రూరల్ నియోజకవర్గాల పరిధిలోని గ్రామాలకు చెందిన 95వేల మంది రైతులకు రుణమాఫీ కాలేదని చెప్పారు. వెంటనే రైతులందరికీ రుణమాఫీచేయాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీ చేయకుంటే సీఎం ఇంటి ముట్టడి

• మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

రైతులందరికీ రుణమాఫీ చేయని పక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో మంత్రులు రోజుకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. రైతులకు రుణమాఫీకి రూ.49వేల కోట్లు కావాల్సి ఉండగా రూ.17వేల 670కోట్లు మంజూరు చేశారని, ఇవి ఏ మూలకు సరిపోతాయని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు రుణాలు తీసుకోండని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి తర్వాత రైతులను మోసగించారని మండిపడ్డారు. ఆర్మూర్‌లోని నవనాథ సిద్దులగుట్ట సాక్షిగా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని ప్రకటించారని గుర్తుచేశారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రైతులను రోడ్డెక్కిస్తున్న సీఎం

• మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

ప్రజలను, రైతులను మోసం చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి దిట్ట అని నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. రైతు ధర్నాలో ఆయన మాట్లాడుతూ తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని అన్నారు. సీఎంకు ప్రజలు, దేవుళ్లపై నమ్మకం లేదని, దేవుళ్ల ఎదుట ప్రమాణం చేసి ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నారని బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. రైతులందరికీ రుణమాఫీ వచ్చేంత వరకు తాము రైతులకు అండగా ఉంటామని చెప్పారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నూతన ఆర్‌వోఆర్ ముసాయిదా బిల్లుపై చర్చా వేదిక

- అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తాం
- హాజరైన ఎమ్మెల్యేలు, కలెక్టర్, అధికారులు, రైతులు

నిజామాబాద్‌అర్బన్, ఆగస్టు24: ధరణి సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నూతన రెవెన్యూ చట్టం 2024 ముసాయిదాపై వివిధ వర్గాల వారిగా అభిప్రాయాలను సేకరించేందుకు వీలుగా శనివారం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో చర్చా వేదిక నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్, మార్క్‌ఫెడ్ చైర్మన్ మారగంగారెడ్డిలతో పాటు న్యాయవాదులు, రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు, రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు హాజరై నూతన రెవెన్యూ చట్టంలోని ముసాయిదా అంశాలపై సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చర్చా వేదిక ద్వారా వెల్లడైన అందరి అభిప్రాయాలను క్రోడీకరించి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. ప్రభుత్వం ఇప్పటికే నూతన ఆర్‌వోఆర్ ముసాయిదా బిల్లు 2024పై ప్రజల నుంచి సీసీఎల్‌ఏ వెబ్‌సైట్ ద్వారా సూచనలు, సలహాలు స్వీకరించడం జరిగిందన్నారు. జిల్లాస్థాయిలోనూ మేధావులు, రెవెన్యూ చట్టంపై అవగాహన కలిగి ఉన్న వారి అభిప్రాయాలను తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ చర్చావేదికను నిర్వహించడం జరిగిందన్నారు. రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు సైతం తమ దైనందిన విధుల నిర్వహణ సందర్భంగా గమనించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తేవాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన చట్టంలోని అంశాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ్‌రెడ్డి తెలియజేశారు. ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, రాకేష్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన నూతన ముసాయిదా చట్టాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. అయితే క్షేత్రస్థాయిలో చట్టాల అమలు పకడ్బందీగా జరగాలన్నారు. చిన్న సన్నకారు రైతులకు లబ్ధిచేకూరేలా సత్వరమే వారి సమస్యలు పరిష్కారమయ్యేలా నూతన చట్టం దోహదపడాలని ఆకాంక్షిస్తూ ఆ దిశగా అధికారులందరూ అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించాలని జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు, రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు, ఆయా మండలాల తహశీల్దార్లు తమ అభిప్రాయాలను వెల్లడించారు. భూ సంబంధిత అంశాలతో కూడిన సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రత్యేక ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసి ఆర్డీవోలకు అప్పిలేట్ అథారిటీ అధికారం కల్పించాలని కోరారు. చర్చా వేదికకు హాజరైన రెవెన్యూ ఉద్యోగులకు, న్యాయవాదులకు, రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులకు, రైతులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ చర్చా వేదికలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, ఐడిసిఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజేశ్వర్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



హాజరైన రైతులు, అధికారులు

అధ్యాపకులు లేక ఆగమాగం!



నిజామాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల

- ముగిసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల అతిథి అధ్యాపకుల గడువు
- పాఠాలు చెప్పేవారు లేక ప్రభుత్వ కళాశాలల వెలవెల • తగ్గిన అడ్మిషన్లు
- ఈనెల 31తో ముగియనున్న అడ్మిషన్ల గడువు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు24: పేద విద్యార్థులకు ఇంటర్మీడియెట్ విద్యను ఉచితంగా అందించే ప్రభుత్వ జూనియర్ కళాశాలలు సమస్యలతో సతమతమవుతున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పాఠాలు చెప్పే అధ్యాపకులు సరిపడా లేక విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రెగ్యూలర్ అధ్యాపకులు లేకపోగా కాంట్రాక్టు అధ్యాపకులను గత ఏడాది రెగ్యూలరైజ్ చేశారు. అయినా జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వజూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల కొరతఉంది. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి జూన్ రెండో వారంలో తరగతులు ప్రారంభమయ్యాయి. జూలై 31తో అతిథి అధ్యాపకుల గడువు ముగిసింది. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న 1354 పోస్టులను భర్తీ చేసేందుకు ఇటీవల పరీక్షలు నిర్వహించింది. ప్రస్తుతం సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతోంది. ఆ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉండగా అతిథిఅధ్యాపకుల గడువు కూడా ముగియడంతో ప్రభుత్వ కళాశాలల్లో పాఠాలు చెప్పేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యాసంవత్సరం ప్రారంభమై 2నెలలు గడుస్తున్నా ఇంకా ఆశించిన స్థాయిలో సిలబస్ పూర్తికాలేదు. చివరి క్షణంలో సిలబస్ పూర్తి చేయడం ద్వారా విద్యార్థులకు పాఠాలు అర్థం కాక ఇబ్బందులు పడే అవకాశం ఉంటుంది. అధ్యాపకుల కొరతతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పాఠాలు చెప్పేవారు లేక సిలబస్ అంతంత మాత్రంగానే అవుతుండటంపై విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈనెల 31తో ఇంటర్మీడియెట్ అడ్మిషన్ల గడువు ముగియనుండగా జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఆశించినస్థాయిలో అడ్మిషన్లు కాలేవు. గత ఏడాదితో పోలిస్తే ఈయేడాది అడ్మిషన్లు గణనీయంగా తగ్గిపోయాయి. జిల్లాలోని 15 ప్రభుత్వజూనియర్ కళాశాలల్లో ఇప్పటివరకు జనరల్ కోర్సులకు 2935 అడ్మిషన్లు అయ్యాయి. వొకేషనల్ అడ్మిషన్లు 902 కాగా మొత్తం 3837 అడ్మిషన్లు అయినట్లు తెలుస్తోంది. కమ్మర్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు కాకపోవడంతో ఆ కళాశాల మూసివేసే పరిస్థితి ఉంది.

• జిల్లాలో 59 మంది అతిథి అధ్యాపకులు

జిల్లాలో మొత్తం 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా కమ్మర్‌పల్లి జూనియర్ కళాశాల అడ్మిషన్లు లేక మూసివేసే పరిస్థితి ఉంది. జిల్లాలోని మిగిలిన 15 జూనియర్ కళాశాలల్లో 59 మంది అతిథి అధ్యాపకులు విధులు నిర్వహించారు. వీరి గడువు జూలై 31తో ముగిసింది. వీరిలో కొంతమంది మళ్లీ రెన్యూవల్ అవుతామనే ఆశతో కళాశాలలకు వెళ్తున్నట్లు సమాచారం. 16మంది మాత్రం వివిధ కారణాలతో కళాశాలలకు వెళ్లడంలేదు. తమను రెన్యూవల్ చేయాలని ఇప్పటికే అతిథి అధ్యాపకులు ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులను కలిసి వినతిపత్రం ఇచ్చినా ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వకళాశాలల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు అక్కడ తగిన సిబ్బంది, వసతులు లేక తిరిగి ప్రైవేటు కళాశాలల్లో చేరుతున్నట్లు తెలుస్తోంది.

• తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

జిల్లాలో ప్రభుత్వజూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య రోజురోజుకు గణనీయంగా తగ్గుతుంది. జిల్లాలో ఇప్పటివరకు 2935 జనరల్ కోర్సులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు అయ్యాయి. 902 అడ్మిషన్లు వొకేషనల్ కోర్సులకు అయ్యాయి. జిల్లావ్యాప్తంగా 3837 అడ్మిషన్లు అయినట్లు తెలుస్తోంది. ఈనెల 31తో అడ్మిషన్ల గడువు ముగియనుండగా కొత్తగా అడ్మిషన్లు అయ్యే పరిస్థితి కనిపించడంలేదు. 2021-22లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో 3768మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 3435 మంది విద్యార్థులు చదివారు. గత విద్యాసంవత్సరం ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో 3679 మంది విద్యార్థులు చదువగా ద్వితీయ సంవత్సరంలో 3వేల మంది వరకు విద్యార్థులు చదివారు. 2022-23 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు గణనీయంగా తగ్గిపోయాయి.

• కళాశాలల వారిగా అడ్మిషన్లు

జిల్లాకేంద్రంలోని కోటగల్లి బాలికల కళాశాలలో జనరల్ కోర్సులకు 341, వొకేషనల్ కోర్సులకు 183 మొత్తం 524 అడ్మిషన్లు అయ్యాయి. జిల్లా బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనరల్ కోర్సులకు 295, వొకేషనల్ కోర్సులకు 185, డిచ్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనరల్ కోర్సులకు 173, వొకేషనల్ కోర్సులకు 44, మాక్లూర్ జూనియర్ కళాశాలలో జనరల్ కోర్సులకు 139, వొకేషనల్‌కు 20, మోర్తాడ్ కళాశాలలో జనరల్ కోర్సులకు 111, వొకేషనల్‌కు 39, బోధన్ శక్కర్‌నగర్ కళాశాలలో జనరల్ కోర్సులకు 136 అడ్మిషన్లు కాగా వొకేషనల్‌లో అడ్మిషన్లు కాలేదు. వర్ని కళాశాలలో జనరల్ కోర్సులకు 58, వొకేషనల్ కోర్సులకు 42 అడ్మిషన్లు, ఆర్మూర్ బాలికల కళాశాలలో జనరల్ కోర్సులకు 332 అడ్మిషన్లు కాగా వొకేషనల్‌కు ఎలాంటి అడ్మిషన్లు కాలేదు. బోధన్ కళాశాలలో జనరల్ కోర్సులకు 414, వొకేషనల్‌కు 176, ఆర్మూర్ బాలుర కళాశాలలో జనరల్ కోర్సులకు 147, వొకేషనల్‌కు 10, భీంగల్ కళాశాలలో జనరల్ కోర్సులకు 237, వొకేషనల్ 127, ఏలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనరల్ కోర్సులకు 69, వొకేషనల్‌కు 15, బాల్కొండ ప్రభుత్వ కళాశాలలో జనరల్ కోర్సులకు 154, వొకేషనల్‌కు 26, ధర్పల్లిలో జనరల్ కోర్సులకు 158, వొకేషనల్‌కు ఎలాంటి అడ్మిషన్లు కాలేదు. కోటగిరి కళాశాలకు జనరల్ కోర్సులకు 171, వొకేషనల్‌కు 35 అడ్మిషన్లు అయ్యాయి.

ప్రభుత్వ ఆదేశాల కోసం చూస్తున్నాం

• రవికుమార్, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అతిథిఅధ్యాపకుల గడువు గతనెల 31తో ముగిసింది. ఖాళీగా ఉన్న అధ్యాపకుల వివరాలు ఉన్నతాధికారులకు పంపించాం. రెన్యూవల్ కాకపోయినా కొంత మంది విధులకు హాజరవుతున్నారు. ఎక్కడ కూడా పాఠాలు చెప్పేందుకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. ఈనెల 31లోగా ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తున్నాం.

జిల్లావ్యాప్తంగా 13.8 సెంటీమీటర్ల వర్షం

- అత్యధికంగా ఆర్మూర్‌లోని మగ్గిడిలో 7 సె.మీ. వర్షం
- జలమయమైన లోతట్టు ప్రాంతాలు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 24: గడిచిన 24గంటల్లో జిల్లావ్యాప్తంగా భారీ వర్షం పడింది. జిల్లావ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు 13.8 సెంటీమీటర్ల వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అత్యధికంగా ఆర్మూర్ మండలం మగ్గిడిలో 7 సెంటీమీటర్ల వర్షం, ఎడపల్లి మండలం జాన్కంపేట్‌లో 6.9 సెంటీమీటర్ల వర్షం కురిసింది. మాక్లూర్ మండలం లక్మాపూర్‌లో 6.6, కోణసముందర్‌లో 6.4, భీంగల్, రెంజల్, నవీపేటలో 6.3, ఆలూర్‌లో 5.8, వేల్పూర్, బోధన్‌లో 5.7, పాల్దాలో 5.5 సెంటీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో నాలుగుచోట్ల భారీ వర్షం కురవగా చాలా ప్రాంతాల్లో మోస్తారు వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి, శనివారం జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షాలతో చెరువులు, వాగులు నిండిపోయాయి. నిజామాబాద్ నగరంలోనూ శుక్రవారం రాత్రి, శనివారం సాయంత్రం వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.



ఎస్సారెస్పీకి పెరుగుతున్న వరద

- విష్ణుపురి నుంచి భారీగా వస్తున్న వరద
- ప్రాజెక్టులోకి 29వేల 443 క్యూసెక్కుల వరద
- కాలువలకు కొనసాగుతున్న నీటి విడుదల

మెండోర, ఆగస్టు 24: ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువ ప్రాంతం విష్ణుపురి నుంచి బాలేగావ్, బాలేగావ్ నుంచి బాబ్లీ ప్రాజెక్టు, బాబ్లీ ప్రాజెక్టు నుంచి ఎస్సారెస్పీ ఎగువ ప్రాంతాల్లో రెండు రెండురోజులుగా కురుస్తున్న వర్షాల కు ప్రాజెక్టులోకి వరదనీరు పెరిగిందని ప్రాజెక్టు ఈఈ చక్రపాణి తెలిపారు. ఈ సందర్భంగా రెండు రోజులుగా ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి 29వేల 443క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుందని పేర్కొన్నారు. విష్ణుపురి నుంచి భారీ వరద చేరుతుండడంతో ప్రాజెక్టులోకి భారీగా నీరు చేరే అవకాశం ఉందని తెలిపారు. ఉదయం ప్రాజెక్టులోకి 3,872 క్యూసెక్కుల వరద స్వల్పంగా చేరగా మధ్యాహ్నం ప్రాజెక్టులోకి వరద పెరిగింది. సాయంత్రం ప్రాజెక్టులోకి 29వేల క్యూసెక్కుల నీరు పెరగడంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. జూన్ 1 తేదీ నుంచి ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి 53 టీఎంసీల నీరు వచ్చి చేరిందని ప్రాజెక్టు ఈఈ చక్రపాణి వివరించారు. ప్రాజెక్టు నుంచి వానకాలం పంటల కోసం కాకతీయ, లక్ష్మీకాలువలకు నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 3వేల క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 50 క్యూసెక్కులు, అవిరి రూపంలో 541 క్యూసెక్కులు, మిషన్ భగీరథ తాగునీటి కోసం 231 క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతుందని తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5టీఎంసీ)లు కాగా శనివారం సాయంత్రం 1082.2 అడుగులు (51.341టీఎంసీ)లు నీటి నిల్వ ఉందని, గత ఏడాది ఇదే రోజున ప్రాజెక్టులో 1090.60అడుగుల (78.868టీఎంసీ) నీటి నిల్వ ఉందని వివరించారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతర కృషి : పీఆర్‌టీయూ

రెంజల్, ఆగస్టు 24: నిరంతరం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని పీఆర్‌టీయూ నూతన మండల అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగంగౌడ్, కిషోర్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ పాఠశాలలో పీఆర్‌టీయూ నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా సోమలింగంగౌడ్, ప్రధాన కార్యదర్శిగా కిషోర్‌కుమార్, అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా తాహెర్, వైస్ ప్రెసిడెంట్‌గా అపర్ణ, సెక్రెటరీగా శ్రీనివాస్‌రెడ్డి, ఉమెన్స్ సెక్రెటరీగా రాజశ్రీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ మండలంలో పీఆర్‌టీయూ బలోపేతానికి కృషి చేస్తామని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ గౌరవ జిల్లా అధ్యక్షులు ఇల్తెపు శంకర్, ఎంఈవో గణేష్ రావు, మండల నోడల్ ఆఫీసర్ ఆంజనేయులు, పీఆర్‌టీయూ నాయకులు సాయిరెడ్డి, నర్సింహ రెడ్డి, గంగాధర్, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్టేట్ డైరెక్టర్ విశ్వనాథ్ రెడ్డి

నిరుద్యోగులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి : డైరెక్టర్

డిచ్‌పల్లి,ఆగస్టు 24 ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ ద్వారా అందిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఏపీ, తెలంగాణ ఉమ్మడి రాష్ట్రాల డైరెక్టర్ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన డిచ్‌పల్లిలో గల ఆర్‌ఎస్‌ఈటీఐ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ జరుగుతున్న మగ్గం వర్క్, టైలరింగ్ శిక్షణ అభ్యర్థులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో బాగ్యలక్ష్మీ, రామకృష్ణ, రంజిత్, నవీన్ పాల్గొన్నారు.

'ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు'

డిచ్‌పల్లి, ఆగస్టు 24: ఓపెన్ స్టడీ సెంటర్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియేట్‌లలో ప్రవేశానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కమలపూర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అమర్‌సింగ్ తెలిపారు. ఆసక్తి గల వారు పాఠశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

'సెమిస్టర్ ఫలితాలు విడుదల చేయాలి'

డిచ్‌పల్లి, ఆగస్టు 24: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో అప్లైడ్ ఎకనామిక్స్ ఐఎంబీఏ, ఇంటిగ్రేటెడ్ ఫార్మాసుటికల్ కెమిస్ట్రీ, ఎల్‌ఎల్‌బీ 6వ సెమిస్టర్ పరీక్షా పలితాలను వెంటనే విడుదల చేయాలని టీయూ పీడీఎస్‌యూ నాయకులు వర్సిటీ అడిషనల్ కంట్రోలర్ఆఫ్ ఎక్సామినేసన్ సాయిలుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ. 6వ సెమిస్టర్ పరీక్షలు పూర్తయ్యి నెల రోజులు గడుస్తున్నా.. ఇంకా పలితాలు విడుదల చేయాలేదని, విద్యార్థులు ఉన్నత విద్య కోసం సెంట్రల్, స్టేట్ యూనివర్సిటీల్లో అప్లై చేసుకున్నారని, వాటి అడ్మిసన్ల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఇందులో ప్రిన్స్, దేవిక, రవీందర్, అక్షయ్, వంశీ, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

పోచారంను కలిసిన వర్ని, చందూర్ నాయకులు



పోచారంను కలిసిన వర్ని నాయకులలు

వర్ని, ఆగస్టు 24: రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారుగా నియమితులైన బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని శనివారం వర్ని, చందూర్ మండలాల కాంగ్రెస్ నాయకులు కలిశారు. వ్యవసాయశాఖ మంత్రిగా అనుభవం ఉన్న పోచారంకు సీఎం రేవంత్ రెడ్డి అదే శాఖలో హోదానివ్వడం హర్షించదగ్గ విషయమని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోచారంను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బి.సత్యనారాయణ, సీహెచ్ గంగారాం, నామాల సాయిబాబా, గిరి, గోపాల్, ప్యారం అశోక్, నరేడ్ల శ్రీను, గొర్తి వెంకటేశ్వర రావు, రాజిరెడ్డి, రుక్మిణీ రాంరెడ్డి, ముజ్జు తదితరులు పాల్గొన్నారు.

పొతంగల్‌లో ఇసుక వేలం

కోటగిరి,ఆగస్టు24: పొతంగల్ మండల కేంద్రంలో సీజ్ చేసిన 45ట్రాక్టర్ల ఇసుకకు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వేలంపాట నిర్వహించారు. పొతంగల్ గ్రామానికి చెందిన గంధపు దత్తు అనే వ్యక్తి 20వేలకు వేలంలో ఇసుకను దక్కించుకున్నట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు.

'విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి'

మాక్లూర్, ఆగస్టు24: ప్రస్తుతం ఇంజనీరింగ్ విద్య కోర్సులలో చేరిన కొత్త విద్యార్థులు భవిష్యత్‌లు ఆలోచించి గొప్ప ఇంజనీర్లుగా రూపుదిద్దుకుంటారని విజయ్ కళాశాలల చైర్మన్ నరేంధర్‌రెడ్డి ఆశభావం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని దాస్‌నగర్ గ్రామశివారులో గల విజయ్ ఇంజనీరింగ్ కళాశాలలో 2024 బ్యాచ్ బిటెక్ అభ్యర్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంధర్‌రెడ్డి జ్యోతిప్రజ్వాలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ విద్యప్రయాణంలో మీరు విజయం సాధించడానికి కళాశాల సంపూర్ణ మద్దతు ఇస్తుందని, అధ్యాపక బృందంతో పాటు కళాశాలలో అన్ని హంగులు ఉన్నాయని, వాటిని ప్రతీఒక్క విద్యార్థి సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ గణేష్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ స్వప్న, ప్లెస్‌మెంట్ అధికారి శ్రీకాంత్‌కుమార్‌తో పాటు అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓపెన్‌స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు24: భీమ్‌గల్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ చదివే విద్యార్థుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మండల విద్యాధికారి, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యలో చదివు మానివేసిన విద్యార్థులు పదవ తరగతిలో ప్రవేశాల కోసం 14ఏళ్ళు నిండి ఉండాలని, ఇంటర్మీడియేట్ ప్రవేశాల కోసం 15ఏళుల నిండి ఉండాలని, ఆసక్తి గల విద్యార్థులు వచ్చేనెల 10తేదీలోగా అడ్మిషన్‌లు పొందాలని కోరారు. ఇతర వివరాలకు 9491534015, 9948082804నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ముప్కాల్ పీఆర్‌టీయూ అధ్యక్షునిగా కొత్తపల్లి శ్రీనివాస్

ముప్కాల్, ఆగస్టు 24 : ముప్కాల్ మండల పీఆర్‌టీయూ అధ్యక్షునిగా కొత్తపల్లి శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఎన్నికల కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రధానకార్యదర్శిగా కోంద్రు నవీన్, మండల అసోసియేషన్ అధ్యక్షునిగా జి.రవి కుమార్, మండల కార్యదర్శిగా రాజేంధర్, మహిళ ఉపాధ్యక్షురాలిగా ఇందిరాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిరంతరం అందరి సహకారంతో పోరాడతామని తెలిపారు.

మూడు ఇసుక టిప్పర్ల పట్టివేత

ఎడపల్లి, ఆగస్టు 24 : ఎడపల్లి మండల కేంద్రంలో శనివారం ఉదయం ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు టిప్పర్‌లను ఎడపల్లి తహసీల్దార్ ధన్వాల్ పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎవరైనా అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక, మొరం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై వంశీ కృష్ణారెడ్డి హెచ్చరించారు.

ఠాణాకలాన్ గ్రామానికి రథం అందజేత

ఎడపల్లి, ఆగస్టు 24 : మండలంలోని ఠానాకలాన్ గ్రామానికి మంగళపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రథాన్ని బహుమానంగా అందజేశారు. మంగళపల్లి ఫౌండేషన్ వ్యవస్థాపకులు మంగళపల్లి నర్సింలు ఠాణాకలాన్ గ్రామాన్ని వదిలి 30 సంవత్సరాలు అయినా తన ఊరుమీద ఉన్న మమకారంతో తన తల్లిదండ్రులు మంగళపల్లి సరస్వతి, పెద్ద గంగారాంల జ్ఞాపకార్థం రెండు లక్షల యాభై వేల రూపాయల ఖర్చుతో స్వర్గధామ రథాన్ని తయారు చేయించి గ్రామానికి బహుమానంగా అందించినందుకు గ్రామస్థులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాలంద భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీటీసి ఆకుల సురేష్, గ్రామ పెద్దలు రాజారెడ్డి, శ్రీనివాస్, గోపీకృష్ణ అరవింద్, సూర సాయి రెడ్డి, సంతోష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

బోధన్‌రూరల్, ఆగస్టు 24 : బోధన్ పట్టణంలో రెండు రోజుల క్రితం లభ్యమైన మృతదేహానికి సంబంధికులు రాకపోవడంతో అనాథ శవానికి శనివారం బోధన్ పోలీసులు, మున్సిపల్ సిబ్బంది అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలు, దహన సంస్కారాలకు కావాల్సిన ఆర్థిక సహాయాన్ని పట్టణ వ్యాపార వేత్త కిషోర్ ఇనాని మార్వాడి సెట్ అందించారు.

జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా శ్యామ్‌రావు

బోధన్‌రూరల్, ఆగస్టు 24: బోధన్ కోర్టులో 5వ అడిషనల్ డిస్ట్రిక్ అండ్ సెషన్ కోర్టులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహిస్తున్న అడ్వకేట్ శ్యామ్‌రావును నిజామాబాద్ జిల్లా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ అండ్ సెషన్ కోర్టుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బోధన్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది శ్యామ్‌రావును నియమించడంతో న్యాయవాదులు, పట్టణ ప్రముఖులు హర్షం వ్యకం చేశారు.

మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్‌కు డాక్టరేట్ ప్రదానం

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 24 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూర్ విజ్ఞాన్ యూనివర్సిటీలో మాజీమున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. గతంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో విద్యపై మమకరంతో పీహెచ్‌డీ చేయాలనే పట్టుదలతో గుంటూరు విజ్ఞాన్ యూనివర్సిటీలో ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో అడ్మిషన్ తీసుకొని పీహెచ్‌డీ పూర్తి చేసింది. దీంతో దీంతో యూనివర్సిటీలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి పోమిడిగంటం నర్సింహంచే డాక్టరేట్ పట్టాను పండిత్ వినీత కుటుంబసభ్యులతో కలిసి అందుకున్నారు.

విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 24 : పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఎంపర్ నిర్మాణ్ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పరిశుభ్రత, తమ ఆరోగ్యాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ నవనాథపురం అధ్యక్షుడు చెరుకు పృధ్వీరాజ్, సభ్యులు భైరి శ్రీదర్, చెన్న రవి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సయ్య పాల్గొన్నారు.

పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు



వేంపల్లి ప్రభుత్వ పాఠశాలలో వేషధారణను తిలకిస్తున్న ఎంపీ

ముప్కాల్, ఆగస్టు24: బాల్కొండ మండలం వేంపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం నిర్వ హించిన కృష్ణాష్టమి వేడుకల్లో ఎంపీ ధర్మపురి అర్వింద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థుల శ్రీ, కృష్ణుడు, గోపికల వేషాదారణ, వారు ఉట్టి కొట్టే ప్రదర్శన ఆయన ఆసక్తిగా తిలకించారు. అనంతరం పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేఈఈ మెయిన్స్‌లో ఆల్‌ఇండియాలో స్థాయిలో 51వ ర్యాంకు సాధించిన విద్యార్థి చరణ్, వారి తల్లిదండ్రులు వెంకట నర్సయ్య దంపతులను ఎంపీ అర్వింద్ అభినందించారు. ఈ సందర్భంగా వారు ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను ఘనం గా సన్మానించారు. ఎంపీ వెంట బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపా ధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, ౹ాజీఎంపీటీసీ నాయకుడు పద్మ, బీజేపీ మండల అధ్యక్షుడు గడ్డం సంతోష్‌రెడ్డి, చిల్క దినేష్, నాయకుడు సంతోష్, కల్లూ స్వామి, నర్సిం గ్‌దాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జెంటిల్‌కిడ్స్ పాఠశాలలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు రాధకృష్ణుల వేషాదారణలో అందరిని ఆకర్షించారు. పాఠశాలలో ఉట్టి ఏర్పాటు చేసి చిన్నారులచే ఉపాధ్యాయులు ఉట్టికొట్టించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ గుజరాతి ప్రకాష్, ప్రిన్సిపాల్ లత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్మైల్ ప్లే స్కూల్‌లో.......

పట్టణంలోని స్మైల్ ప్లే స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు రాధకృష్ణుల వేషాదారణలో ఏర్పాటు చేసిన ఉట్టిలను కొట్టారు. అనంతరం కరస్పాండెంట్ షబాన గోహెర్ కృష్ణాష్టమి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రఫీగోహెర్, ఉపాధ్యాయులు సరిత, స్వప్న, సింధుజ, ప్రసన్న, సరిత, రోజ శ్రావణి, శ్వేత, తదితరులు పాల్గొన్నారు.



కుకునూర్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు

వేల్పూర్: మండలంలోని కుకునూర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థినిలు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చిన్నికృష్ణుడు గొల్ల బామల విద్యార్థిని విద్యార్థులు అలరింపజేశారు. విద్యార్థులు ఉట్టికొట్టి ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరిప్రసాద్; నరేంధర్, రామకృష్ణ, నీరజ, తేజస్విని, పేరెంట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండలంలోని చతురస్ర పాఠశాలలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు కృష్ణుడు గొల్లబామలతో వేష దారణలో నృత్యాలు చేసి గ్రామస్థులను అలరించారు. సాయంత్రం విద్యార్థులచే ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన శ్రీకృష్ణుడు, రాధ, గోపికల అందంగా తయారు కావడంతో గ్రామస్థులను ఆకట్టుకున్నాయి.

పెర్కిట్ : ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలోని శనివారం నలంద పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చిన్నారులు రాధ కృష్ణుడు వేషాదారణలో ఎంతగానో ఆకట్టుకున్నాయి. చిన్ని కృష్ణుడు పాటలపై చిన్నారులు నృత్యాలు పలువురిని అలరించాయి.. అలాగే పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉట్టిని చిన్నారులందరు కలిసి ఉట్టిని కొట్టారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలోని క్షత్రీయ పాఠశాలలో శనివారం కృష్ణష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు రాధకృ ష్ణుల వేషధారణలో అలరించారు. నృత్యప్రదర్శనలు, భగవద్గీత శ్లోకాలతో చిన్నారులు అందరిని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో నవీత, క్షత్రీయ విద్యా సంస్థల కోశాధికారి అల్జాపూర్ గంగాధర్, డైరెక్టర్ అల్జాపూర్ అక్షయ్, పరిక్షిత్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నవీపేట : మండలంలోని పలు గ్రామాలలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు రాధాకృష్ణులు, గోపికల వేషదారణ ధరించి అందరిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి మండల కేంద్రంలో వేద పాఠశాలలో శనివారం కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో అలరించారు. ఉట్టి కొట్టే కార్యక్రమం ఎంతగానో ఆకట్టుకుంది. సాంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా కృష్ణాష్టమి వేడుకలు కొనసాగాయి. కార్యక్రమంలో పాఠశాల బృందం రవి, అక్షర, నిర్మల, సాయి పవన్, రేష్మ, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : కమ్మర్‌పల్లి మండంలోని వివిధ పాఠశాలల్లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను విద్యార్థిని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాల విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన ఉట్లుకొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. మిసిమి, విజ్ఞానజ్యోతి, కృష్ణవేణి పాఠశాలలో ఉట్లు కొట్టే కార్యక్రమాన్నిఘనంగ జరుపుకున్నారు.ఈ సందర్భంగా చిన్ని కృష్ణుడు గోపికల వేశాధ్యాణలో చిన్నారి విద్యార్థిని విద్యార్థులు అలరించగా విద్యార్థినుల కోలాటాలు అకర్షనియంగా నిలిచారు. కార్యక్రమంలో పాఠశాలల కరస్పాండెంట్లు బాలి రవిందర్, గుండోజి దేవేందర్, చిలుక గంగప్రసాద్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో...

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



కోనాసముందర్‌లో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు



మాక్లూర్‌లో వైద్యం అందిస్తున్న వైద్యులు

కమ్మర్‌పల్లి,ఆగస్టు 24: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతు దోమలు వ్యాపించకుండా అప్రమత్తంగా ఉండాలని చౌట్‌పల్లి ప్రభుత్వం ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ సుప్రియా సూచించారు. శనివారం మండలంలో ని కోనాస మందర్ గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి గ్రామ ప్రజలకు వైద్యసేవలందించారు. ఈ సందర్భంగా గ్రామానిక చెందిన 78 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి దగ్గు, జలుబు, జ్వరం ఉన్నవారికి తగుమందులు అందజేశారు. జిల్లా కలెక్టర్, వైద్యాశాఖ అధికారి ఆదేశానుసారం చౌట్‌పల్లి ఆసుపత్రి పరిధి గ్రామంలో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పర్యిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సీనల్ వ్యాదులు దరిచేరకుండా అప్రమత్తంగా ఉండాలని కాచి వడబోసిన నీటినే తాగాలని సూచిస్తు ఏలాంటి ఇబ్బందుల ఎదురైన సమీప ఆసుపత్రులకు వెల్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారుగురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సదాశివ్, ఆరోగ్యవిస్తీరణ అధికారి చింత సత్యనారాయణ, స్థానిక ఏఎన్ ఎం అమృత, ఆశావర్కర్‌లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మాక్లూర్ : మండల ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి వెంకటేశం సూచించారు. శనివారం మండల కేంద్రంలోని మాక్లూర్ జిల్లా వైద్యాధికారి ఆదేశాల ప్రకారం ప్రజలకు వైద్యసేవలను అందజేశారు. ఈ సందర్భంగా రూ.58మందికి వైద్యుల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచివడబోసిన నీటిని తాగి ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచించారు. శనివారం జక్రాన్ పల్లిలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. దోమల వల్ల వ్యాపించే డెంగ్యు, మలేరియా, బోదకాల వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫ్రైడే డ్రైడేను నిర్వహించి దోమల నివారిస్తే రోగాలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా సబ్‌యూనిట్ అధికారి సాయన్న, హెల్త్ సూపర్‌వైజర్ సిద్ధి, హెల్త్ అసిస్టెంట్ రాజు, ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తాం

● ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

మాక్లూర్, ఆగస్టు 24: పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతీఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేయడమే తన కర్తవ్యమని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది నుంచి ఎదురు చూస్తున్న సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్నానని, వచ్చేనెల రేషన్‌కార్డు, పింఛన్ దరఖాస్తులను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఇళ్ళు లేని వారికి ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షలు అందజేస్తామన్నారు. హిందువలంత ఐక్యంగా ఉండాలని, హిందు సమాజం ఇతరులకు ఆదర్శంగా ఉంటూ కులాలకు అతీతంగా అభివృద్ధిని కోరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో క్రాంతి, బీజేపీ మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్, గంగోని సంతోష్, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న దృశ్యం



నవీపేటలో..

రెంజల్,ఆగస్టు24: పేదల సంక్షేమం కోసం నిరంతరం తపించే మార్గదర్శకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండలానికి మంజూరైన 79సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేసే నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అన్నారు. ప్రజల కోసం తపించే నాయకుడు ముఖ్యమంత్రి అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం నిరంతరం కృషి చేసే నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహిపాల్ రెడ్డి, సాయిరెడ్డి, ధనుంజయ్, సాయిబాబా గౌడ్, రమేష్ కుమార్, జావీదోద్దీన్, సురేందర్ గౌడ్, నితిన్, శ్రీనివాస్, మోహన్, గంగాకిషన్, గయాస్, సాయాగౌడ్; కార్తీక్, కిరణ్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ ౹ాకార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 78మందికి 16.61,500 రూపాయ్యాలు మన్యాజూరయ్యాయి. సంబంధిత చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, బాలరాజు గౌడ్, బుచ్చన్న, సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు మంజూరైన సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం మండల కాంగ్రెస్ నాయకులు పంపినిచేశారు. కమ్మర్‌పల్లికి చెందిన సుందరిగిరి దిలీప్‌కు 29 వేలు, కోటగిరి రాజగౌడ్‌కు 55 వేల రూపాయల చెక్కులు మంజూరిగా కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు స్కుఎట రవి బాదితలకు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు బుచ్చిమల్లయ్య, వేముల గంగారెడ్డి, సల్లూరి గణేష్ గౌడ్, దూలూరు కిషన్ గౌడ్, శేఖర్, నాగరాజు, పాలెపు చిన్న గంగారాం, అజారోద్దీన్ , సుంకెట శ్రీనివాస్, ప్రసాద్, ప్రదీప్, సుంకరి రాజేశ్వర్, నల్ల సాయికుమార్, చంద్రకాంత్ రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంరిలీఫ్ ఫండ్ మంజూరి చేయించి కాంగ్రెస్ బాల్కొండ నియోజికవర్గ ఇన్‌చ్యార్జ్ ముత్యాల సునీల్ కుమార్, కాంగ్రెస్ నాయకులకు బాదితు కృతజ్ఞతలు తెలిపారు.

వేల్పూర్ : వేల్పూర్ మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, నాయకులు పంపిణీ చేశారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్ కుమార్ ప్రత్యేక చొరవతో మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన ఆదేశాల మేరకు పంపిణీ చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమణ, రేవంత్‌రెడ్డి, చరణ్, మల్లారెడ్డి, పద్మరావు, సురేందర్, అనిల్, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ల్యాప్‌టాప్, ఎల్ఈడీ టీవీ వితరణ

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు 24 : భీమ్‌గల్ మండలంలోని గోనుగోప్పుల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు విద్యార్థుల సౌకర్యార్థం దాతలు రిటైర్డు అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి, చెరుకుపల్లి విజయేందర్‌రెడ్డి కుటుంబసభ్యులు ల్యాప్‌టాప్, ఎల్ఈడీ టీవీని వితరణ చేశారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారంగా వీటిని అందజేసినట్లు దాతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు శంకర్, బోజాగౌడ్, భూమేశ్వర్, చరణ్‌గౌడ్ పాల్గొన్నారు.

వేర్వేరుగా బస్సులు నడపాలని వినతి



సూపరింటెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

నవీపేట, ఆగస్టు 24: మండలంలోని నందిగామ, మద్దెపల్లి గ్రామాలకు వేర్వేరుగా బస్సులను నడపాలని కోరుతూ శనివారం నందిగామ, యంచలకు చెందిన పలువురు గ్రామస్థులు నిజామాబాద్ ఆర్టీసీ డిపో-2 సూపరిండెంట్ శ్రీలతకు వినతిపత్రం సమర్పించారు. గతంలో నందిగామ, మద్దెపల్లి గ్రామాలకు వేర్వేరుగా ౹ాబస్సులు నడిచేవని, ప్రస్తుతం రెండు గ్రామాలకు కలిపి ఒకే బస్సునూ తిప్పడంతో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భూంరావ్, లాలు యాదవ్, సంజీవ్, అనంత రావు, మహేష్, మహదేవ్, రాజు, తదితరులున్నారు.

విద్యార్థులకు స్టీల్ వాటర్‌బాటిళ్లు అందజేత

వేల్పూర్, ఆగస్టు 24 : వేల్పూర్ మండలం కుకునూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు హరిచరణ్ విద్యార్థులకు స్టీల్‌వాటర్ కావాలని కోరారు. దీంతో స్పందించిన ఆయన తమ్ముడు అనసూరి వసంత్‌సాయి (సెంట్రల్ ఎక్సైజ్ ఇన్స్‌పెక్టార్) ఆయన భార్య మౌనిక (స్టేట్ బ్యాంక్ అధికారిణి) విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్ళను అందజేశారు. సుమారు రూ.20వేల విలువ గల స్టీల్ వాటర్ బాటిళ్ళను వంద మంది విద్యార్థిని విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు క్లాస్ గదుల్లో వెళ్ళేటప్పుడు స్టీల్ వాటర్ బాటిల్ తీసుకొని వెళ్ళాలని, విద్యార్థులు పాఠాలు వింటున్న సమయంలో దాహం వేసినప్పుడు ఈ వాటర్ బాటిల్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కాల సాయన్న, ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ దాసరి వనిత, మాజీ వైస్‌ఎంపీపీ బోజపల్లి సురేష్, మాజీసర్పంచ్ శ్రీరాం విజయ లింబాద్రి, మాజీ విద్య కమిటీ చైర్మన్ పడాల రాజశేఖర్‌గౌడ్, వీడీసీసభ్యులు గోడ్కొండ లింగన్న, దాసరి నర్సయ్య, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మెండోర మండల పీఆర్‌టీయూ కార్యవర్గం ఎన్నిక

మెండోర, ఆగస్టు 24 : మండల పీఆర్‌టీయూ కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం పీఆర్‌టీయు మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా సురేందర్, మండల ప్రధానకార్యదర్శిగా నర్సింలు, అసోసియేట్ అధ్యక్షుడుగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా ఉషరాణి, సెక్రెటరీగా వినోద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో ఐదు సెంటీమీటర్ల వర్షపాతం

కమ్మర్‌పల్లి, ఆగస్టు 24 : కమ్మర్‌పల్లి మండలంలో శుక్రవారం అర్ధరాత్రి భారీవర్షం కురిసింది. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజాము వరకు ఓ మోస్తారులో వర్షం కురిసింది. మండలంలో 50.6 మిల్లీమీటర్లు (5 సెంటిమీటర్ల)వర్షపాతం నమోదయింది. ఈవర్షంతో మండలంలో అతిపెద్ద చెరువు బషీరాబాద్ కాడిచెరువు నిండి అలుగు పారింది. మండలంలోను అత్యధిక ఆయకట్టు ఉన్న చెరువు బషీరాబాద్ కాడిచెరువు దీని ఆయకట్టు సుమారు 6 వందల ఎకరాలువరకు ఉంటుంది. కాడిచెరువు నిండడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. కాగా గతవారం రోజులక్రితమే కోనాసముందర్ చెరువు, ఇదివరకే రాళ్లవాగు , గట్టుపొడిచినవాగులు పొంగిపొర్లుతుండగా మండంలోని వివిధ గ్రామాలలోని చెరువులు కుంటలు మత్తళ్లు పారుతున్నాయి.



అలుగు పారుతున్న బషీరాబాద్ కాడిచెరువు



మాట్లాడుతున్న దినేష్

'పార్టీ బలపడాలంటే సభ్యత్వ నమోదు కీలకం'

పెద్దబజార్, ఆగస్టు 24: బీజేపీ మరింత బలపడాలంటే సభ్యత్వ నమోదు ఎంతో కీలకమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అన్నారు. శనివారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా సెప్టెంబర్1 నుంచి 25వరకు మొదటివిడత సభ్యత్వనమోదు, అక్టోబర్1 నుంచి 25వరకు రెండోవిడత సభ్యత్వ నమోదు నిర్వహిస్తామన్నారు. ఈ సభ్యత్వ నమోదులో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లెగంగారెడ్డి, పెద్దోళ్ల గంగారెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి న్యాలంరాజు, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, బిజెపి నాయకులు భూమన్న, శివరాజ్‌కుమార్, అసెంబ్లీ కన్వీనర్‌లు, మండల అధ్యక్షులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమిని ఘనంగా నిర్వహించాలి

పెద్దబజార్, ఆగస్టు24: ఈనెల 26న శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఇస్కాన్ కంఠేశ్వర్ ఇందూరు అధ్యక్షుడు రామానంద రయాగౌర తెలిపారు. శనివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 26న ఇస్కాన్ కేంద్రంలో ఉదయం 5గంటల నుంచి 11గంటల వరకు మంగళహారతి, గురుపూజా, శ్రీమద్ భగవత్ ప్రవచనలు, సంకీర్తనలు, వినాయక్‌నగర్‌లోగల విజయలక్ష్మి గార్డెన్‌లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, సంకీర్తనలు, శ్రీకృష్ణ లాలామృత ప్రవచనములు, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నితాయ్ చంద్, రమణ గోపేషా దాస్, బలరాం ఆదిగురు దాస్, దేశెట్టి సాయిలు, ప్రభుజీ, సర్వనాథ ప్రభు, మహాప్రభు, మహేశ్వర దాస్ తదితరులు పాల్గొన్నారు.

'కల్తీ మద్యంపై చర్యలు తీసుకోవాలి'

సిరికొండ, ఆగస్టు 24: సిరికొండ-ధర్పల్లి మండలాల్లో నాసీరకం, కల్తీ మద్యం విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథ నాయకులు ఎక్సైజ్ అధికారులను కోరారు. సిరికొండ, ధర్పల్లి మండలాల్లోని బెల్టుషాపుల్లో విచ్చలవిడిగా కల్తీ మద్యాన్ని విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారిపోయి అమాయకులను దోపిడీ చేస్తున్నారని అన్నారు. ముడుపులకు అలవాటు పడిన ఆబ్కారీ శాఖ అధికారులు వైన్స్ యజమానులకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని మద్యం వ్యాపారుల దోపిడీని అరికట్టాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో దామోధర్, సాయరెడ్డి, ఈ.రమేష్, ఆశీష్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీ హబ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 24: గత 10 నెలలుగా పనిచేస్తున్న తమను కొత్తగా వచ్చిన ఏజెన్సీ వెళ్లిపోవాలని వేధిస్తున్నారని, తమకు న్యాయం చేయాలని కోరుతూ జిల్లాకేంద్రంలోని బైపాస్ రోడ్‌లో ఉన్న ఐటీ హబ్‌లో పనిచేస్తున్న 19మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు శనివారం ఐటీహబ్ ఎదుట ధర్నా నిర్వహించారు. గత పది నెలల నుంచి తాము ఐటీ హబ్‌లో పనిచేస్తున్నామని ఇప్పుడు కొత్తఏజెన్సీ తమను వెళ్లిపోవాలని చెబుతున్నారని తమను తిరిగి ఉద్యోగాల్లో కొనసాగించాలని లేకపోతే ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు ప్రకాశ్, అనసూయ, కనకమ్మ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో బదిలీపై వెళ్లిన ప్రొఫెసర్లకు సన్మానం

పెద్దబజార్, ఆగస్టు24: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి సాధారణ బదిలీలపై వెళ్లిన ఆర్థోపెడిక్ వైద్యులు నాగేశ్వర్‌రావు, పిఎల్ శ్రీనివాస్‌లను శనివారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రొఫెసర్ల సేవలు మరువలేనివని వారిని ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటామని తెలిపారు. వారిద్దరితో ఎంతో సమన్వయంతో సహకారంతో విధులు నిర్వహించి వారిని చూసి మనమెంతో నేర్చుకోవాలన్నారు. ప్రపంచ ఆర్థ్రైటిస్ దినోత్సవం రోజున పేద గ్రామాల రోగులకు ఒకేరోజులో పది మోకాళ్ల కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు చేశారని అన్నారు. ఇప్పటివరకు 300లకు పైగా మోకాళ్ల కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బాల్‌రాజ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాల పంపిణీ

మోపాల్, ఆగస్టు 24: లయన్స్‌క్లబ్ ఆఫ్ నిజామాబాద్ యువశక్తి, హైదరాబాద్ సంస్కృతి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మోపాల్ మండలం సిర్పూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నోట్‌పుస్తకాలను, చాక్లెట్‌లను పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు వెంకటేశ్ మాట్లాడుతూ పిల్లలు శ్రద్ధగా చదువుకోవడమే కాకుండా ప్రస్తుత సమాజాన్ని పెడదోవ పట్టిస్తున్న మత్తుపదార్థాల వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలని చెడు వ్యసనాల వైపు వెళ్లవద్దని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల చదువులకు చేయూతనిచ్చే విధంగా లయన్స్ క్లబ్ సంస్థ పుస్తకాలను అందించడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సాయిబాబు, ఆకాశ్, ఉపాధ్యాయులు శ్యామల, మోహన్, వందన, గాయత్రీ, అక్బర్ బాషా, శ్రీనివాస్, నరేష్, లలిత, పాల్గొన్నారు.

సమస్య ఉన్నచోట

పరిష్కార మార్గమూ ఉంటుంది



మాట్లాడుతున్న జస్టిస్ సుజోయ్‌పాల్

● హైకోర్టు న్యాయమూర్తి సుజోయ్‌పాల్



పాల్గొన్న న్యాయవాదులు

నిజామాబాద్ లీగల్, ఆగస్టు 24: సమస్య ఉన్న చోట పరిష్కార మార్గమూ ఉంటుందని, అన్వేషించి పరిష్కారానికి కృషి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయసేవా అధికార సంస్థ కార్యనిర్వహక చైర్మన్ జస్టిస్ సుజోయ్‌పాల్ అన్నారు. జిల్లా న్యాయసేవా అధికారసంస్థ సహకారంతో తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవాసదన్‌లో కమ్యూనిటీ మీడియేటర్స్ 3రోజులపాటు నిర్వహించిన శిక్షణముగింపు కార్య క్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మనుషుల మధ్యతలెత్తిన వివాదాలు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునే వీలు ఉందని అన్నారు. మధ్యవర్తిత్వానికి ప్రాచీన చరిత్ర ఉందని, ఆ స్ఫూర్తితో మధ్యవర్తిత్వ చట్టం అమలు చేయబడుతుందని పేర్కొన్నారు. భార్యాభర్తల మధ్య ఉన్న అంతర్గత సమస్యలు చట్ట సంబంధితమైనవా అంటూ జస్టిస్ సుజోయ్ పాల్ ప్రశ్నిస్తూ అవన్నీ కుటుంబసభ్యుల మధ్య పరిష్కరించుకునేవని పేర్కొన్నారు. వృద్ధులైన తల్లిదండ్రులను పోషించని వారి సంతానం మధ్య వర్తిత్వ భాషను అర్థం చేసుకోవాలని అన్నారు. కుటుంబ వివాదాలు అన్ని సామాజి క సమస్యలేనని తెలిపారు. సమాజంలోని అన్ని క మ్యూనిటీలకు చెందిన వ్యక్తులతో కమ్యూనిటీ మీడియేటర్లను ఏర్పాట్లుచేసి మధ్యవర్తిత్వ విలువలు, ప్రయోజనాలు తెలియజేస్తూ రాష్ట్రంలోనే ప్రథమంగా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని వారికి శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఒక భవనానికి పునాది ఎంత బలమైనదో మధ్యవర్తిత్వానికి కమ్యూనిటీ మీడియేటర్స్ అంత బలమైన వారని, ప్రజా సమూహాలలో నెలకొన్న సమస్యలను తొలగించడంలో మధ్యవర్తిత్వ ప్రతినిధుల పాత్ర గణనీయమని అన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే వారికి పరిస్థితులపై, సమస్యలపై అవగాహన ఉంటుందని కమ్యూనిటీ మీడియేటర్ల రోల్‌మోడల్‌గా నిలుస్తారని పేర్కొన్నారు. జిల్లా న్యాయసేవా అధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాల మాట్లాడుతూ సమయానికి అనుకూలంగా సమస్యలు విని అర్థం చేసుకొని న్యాయమూర్తులను పరిష్కరించుకునే దిశగా ప్రేరేపించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు వరప్రసాద్, సీహెచ్ పంచాక్షరి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, శ్రీకాంత్, అదనపు జిల్లా జడ్జిలు శ్రీనివాస్, ఆశలత, జూనియర్ సివిల్ జడ్జిలు గోపికృష్ణ, చైతన్య, హరికుమార్, శ్రీనివాస్‌రావు, చీఫ్‌లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్‌కుమార్ సుబేదార్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఉదయ్‌కృష్ణ, ప్రమోద్, శుభం, న్యాయవాదులు మానిక్‌రాజ్, ఆశానారాయణ, అంకిత, రణదీశ్, న్యాయసేవా సంస్థ పర్యవేక్షకులు పురుషోత్తంగౌడ్, చంద్రసేనరెడ్డి, డాక్టర్ మహ్మద్ షమీమ్, గిరిబాల సింగ్ పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తులకు ఘనస్వాగతం



న్యాయమూర్తులకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు24: హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సుజోయ్‌పాల్, జె. శ్రీనివాస్‌రావులు శనివారం జిల్లా పర్యటనకు రాగా జిల్లా ఉన్నతాధికారులు, న్యాయవాదులు ఘనస్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలో జరుగుతున్న కమ్యూనిటీ మీడియేటర్ల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి హాజరైన వీరికి నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద జిల్లా జడ్జి సునీత కుంచాల, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, ఆయా శాఖల జిల్లాల అధికారులు, న్యాయశాఖల అధికారులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు పూలమొక్కలు ఇచ్చి స్వాగతం పలికారు.



నిత్యావసర సరుకులను అందజేస్తున్న ఎమ్మెల్యే

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన అర్బన్ ఎమ్మెల్యే

పెద్దబజార్, ఆగస్టు 24: నగరంలోని ఆనంద్‌నగర్‌లో ఇటీవల మురికికాల్వలో పడి చనిపోయిన చిన్నారి అనన్య కుటుంబాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పరామర్శించారు. ఘటనకు గల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో లోతట్టు ప్రాంతాల్లో డ్రైనేజీ, రోడ్లు, నాళా కబ్జాల పై దృష్టిపెట్టాలని మున్సిపల్ కమిషనర్, అధికారులకు పలుమార్లు చెప్పినా చర్యల్లేవని మండిపడ్డారు. వీధిదీపాల సౌకర్యాలు కల్పించడంలోనూ అధికారులు విఫలమవుతున్నారని అన్నారు. నగర సమస్యలపై కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని మౌలిక సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. అనన్య కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయం, నిత్యవసరుకులు అందించి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 27వ డివిజన్ కార్పొరేటర్ వెల్డింగ్ నారాయణ, 9వ డివిజన్ కార్పొరేటర్ సాదు సాయివర్ధన్, బిజెపి నాయకులు ప్రభాకర్, పవన్, అంబదాస్, వెంకటరమణ, హరీష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 24: నగరంలోని పలు పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం నగరంలోని సుభాష్‌నగర్‌లోగల కాకతీయ ఒలంపియాడ్ పాఠశాలలో కృష్ణాష్టమి సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణుడు, గోపిక, రాధా వేషాధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ రామోజిరావు, పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. అలాగే నగరంలోని న్యాల్‌కల్ రోడ్‌లోగల నలంద హైస్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు వెన్న కుండలతో, పిల్లనగ్రోవితో శ్రీకృష్ణుడి వేషాధారణలో ఆకట్టుకున్నారు. డోలోత్సవం, ఉట్టి కొట్టే కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు మురళీకృష్ణ, చిన్నారులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని కోటగల్లిలోగల కాకతీయ పబ్లిక్ స్కూల్‌లో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ రజనీకాంత్, ప్రధానోపాధ్యాయులు ఫరీద్ ఉద్దీన్, ఉపాధ్యాయులు త్రివే ణి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్పల్లిలో..

ధర్పల్లి: మండల కేంద్రంలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామంలోగల లిటిల్ హార్ట్స్ పాఠశాల, సన్‌షైన్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బలరామ కృష్ణ వేషాధారణలతో చిన్నారులను అలంకరించి అందంగా తీర్చిదిద్దారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమానికి చిన్నారులు పోటీ పడ్డారు. సంస్కృతి సంప్రదాయాలను అద్దం పట్టే విధంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఆనందంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్లు శ్రీకాంత్, మహేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.



ధర్పల్లిలో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు



గన్నారం సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

సబ్‌స్టేషన్ వద్ద రైతుల ఆందోళన

● కరెంటు కోతలపై ఆగ్రహం

● సమస్య పరిష్కరిస్తామని సీఐ హామీతో ఆందోళన విరమణ

ఇందల్వాయి, ఆగస్టు 24: మండలంలోని గన్నారం సబ్‌స్టేషన్ వద్ద శనివారం ఉదయం మేగ్యానాయక్ తండా రైతులు, గ్రామస్థులు సబ్‌స్టేషన్‌ను ముట్టడించి ధర్నా నిర్వహించారు. కరెంటు కోతలు విధిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు సబ్‌స్టేషన్ ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఇకనుండైనా తమకు కోతలు లేకుండా నాణ్యమైన నిరంతరం కరెంటు ఇవ్వాలని నినాదాలు చేశారు. ఓల్టేజ్ హెచ్చుతగ్గుల వల్ల వ్యవసాయ బోరుమోటార్లు దెబ్బతింటున్నాయని, తరుచూ ట్రాన్స్‌ఫార్మర్లు మొరాయిస్తుండటంతో పంటలకు నీరు పారించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు తెలిపారు. రైతులు ఆందోళన చేస్తున్నారన్న సమాచారంతో డిచ్‌పల్లి సీఐ మల్లేష్, ఇందల్వాయి ఎస్సై మనోజ్‌కుమార్‌లు సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళన చేస్తున్న రైతులను సముదాయించారు. తమ సమస్యలు పరిష్కరిస్తేనే ఆందోళన విరమిస్తామని చెప్పడంతో విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా చూస్తామని రైతులకు హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. మరోసారి ఇలాంటి సమస్యలు పునరావృతమైతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని నేషనల్ హైవే పై బైటాయించి నిరసనకు దిగుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లలిత గణేష్, వీడీసీ చైర్మన్ మున్సిరాం, గ్రామ రైతులు నర్సింగ్, దేవేందర్, ధర్‌సింగ్, హీరామన్, అనూహాంస్సేన్, తదితరులు ఉన్నారు.

నిజామాబాద్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.శివప్రసాద్

పెద్దబజార్, ఆగస్టు 24: నిజామాబాద్ జిల్లా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.శివప్రసాద్ నియమితులయ్యారు. శనివారం హైదరాబాద్ డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులను జారీ చేసింది. కొన్ని రోజుల క్రితం వరకు ఇక్కడ పనిచేసిన ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర హైదరాబాద్ గాంధీ మెడికల్ కళాశాలకు బదిలీ అయిన విషయం తెలిసిందే. అప్పటినుంచి డాక్టర్ నాగమోహన్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. నూతనంగా నియమితులైన ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శివప్రసాద్ త్వరలో విధులకు చేరనున్నారు. డాక్టర్ శివప్రసాద్ నిజామాబాద్ మెడికల్ కళాశాల, అనుబంధ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సైకియాట్రిక్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

ఆర్టీసీ డ్రైవర్ సస్పెన్షన్

సుభాష్‌నగర్, ఆగస్టు24: రైల్వేకమాన్ ఘటనలో ఆర్టీసీ బస్‌డ్రైవర్ సాంబయ్యను సస్పెండ్ చేస్తూ ఆర్టీసీ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. అజాగ్రత్తతో నీటి ప్రవాహం చూసుకోకుండా రైల్వేకమాన్ ప్రాంతంలో బస్సును తీసుకువెళ్లినందుకు ఆర్టీసీ డ్రైవర్‌ను సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఈఘటనపై సోషల్ మీడియాలో బస్సు డ్రైవర్‌పై విమర్శలు వెల్లువెత్తడంతో ఆర్టీసీ అధికారులు డ్రైవర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చెరువులో మునిగి ఒకరి మృతి

ఇందల్వాయి, ఆగస్టు24: ఓ యువకుడు అంత్యక్రియ ముగించుకున్న అనంతరం చెరువులో స్నానానికి వెళ్లి నీటమునిగి మృతిచెందినట్లు ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు. ఇందల్వాయి మండలంలోని సిర్నాపల్లి గ్రామానికి చెందిన పోగుల రాహుల్ (19) యువకుడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడని అన్నారు. ఇందల్వాయి ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాహుల్ సిర్నాపల్లి గ్రామంలో ఒకరు మృతిచెందడంతో అంత్యక్రియల్లో పాల్గొన్నాడని, అంత్యక్రియలు ముగిసిన అనంతరం పక్కనే ఉన్న మత్తడి వాగులో స్నానానికి వెళ్లగా అందులో మునిగిపోయినట్లు తెలిపారు. అక్కడేఉన్న స్థానికులు గమనించి చాలాసేపు గాలించగా మృతదేహాన్ని నీటిలో నుంచి బయటకు తీసి పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి ఇందల్వాయి ఎస్సై తన సిబ్బందితో కలిసి వెళ్లారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వఆసుపత్రికి తరలించామని పేర్కొన్నారు. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాఫిక్ రూల్స్ అందరూ పాటించాలి

బోధన్‌రూరల్, ఆగస్టు 24: ట్రాఫిక్ నిబంధనలను అందరూ పాటించాలని ఎంవీఐ శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వం నూతన చట్టాలను అమలులోకి తీసుకువచ్చిందని ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. శనివారం విజయమేరి హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ బోధన్ అపెక్స్ వైటెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంవీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ లయన్స్ లంక రవి, క్లబ్ అధ్యక్షులు, సభాధ్యక్షులు లంక జారుష, అద్దంకి ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.85	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	: రూ.95	రూ.205	రూ. 225

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.74,300	రూ.68,500	రూ.900

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : స్త్రీ-2 (హిందీ) (10.00, 4.30, 10.50)
: కమిటీ కుర్రాళ్లు (1.15)
: అయ్ మేం ఫ్రెండ్స్ అండి (7.45)

స్క్రీన్-2 : ఏలియన్ రొమ్యులస్ (10.15)
: అయ్ మేం ఫ్రెండ్స్ అండి (1.00)
: తంగాలన్ (4.05)
: స్త్రీ-2 (హిందీ) (7.25)
: మారుతినగర్ సుబ్రమణ్యం (10.40)

స్క్రీన్-3 : డిమోంటి కాలనీ-2 (10.20, 4.40, 10.30)
: స్త్రీ-2 (హిందీ) (1.25)
: ఏలియన్ రొమ్యులస్ (ఇంగ్లీష్) (7.45)

స్క్రీన్-4 : మారుతినగర్ సుబ్రమణ్యం (10.00)
: తంగాలన్ (1.10)
: అయ్ మేం ఫ్రెండ్స్ అండి (4.30)
: కమిటీ కుర్రాళ్లు (7.35)
: ఇంద్ర (10.50)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : అయ్ మేం ఫ్రెండ్స్ అండి (10.20, 4.20, 10.20)
: తంగలాన్ (1.20, 7.20)

స్క్రీన్-2 : డిమోంటి కాలనీ-2 (10.25, 10.20)
: స్త్రీ-2 (హిందీ) (1.30)
: కమిటీ కుర్రాళ్లు (4.30)
: అయ్ మేం ఫ్రెండ్స్ అండి (7.30)

స్క్రీన్-3 : స్త్రీ-2 (హిందీ) (10.20, 10.20)
: మారుతినగర్ సుబ్రమణ్యం (1.20)
: డిమోంటి కాలనీ-2 (4.20)
: డబుల్ ఇస్మార్ట్ (7.10)

దేవి : తంగలాన్ (11.15, 2.15, 6.15, 9.15)

నటరాజ్ : కమిటీ కుర్రాళ్లు (11.15, 2.15, 6.15, 9.15)

విజయ్ : మిస్టర్ బచ్చన్ (11.15, 2.15, 6.15, 9.15)

లలితామహాల్ : డబుల్ ఇస్మార్ట్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్